# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- పర్యాటక శాఖ ఈ సంవత్సరం 20 శాతం వృద్ధి రేటు సాధించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశు సంవర్ధక శాఖా మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు.
- తైవాన్ కు చెందిన ఒక వాణిజ్య బృందం ఈరోజు రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి నారా లోకేశ్ తో సమావేశమయ్యింది.
- ఉడకబెట్టిన కోడి మాంసం, గుడ్లు తినడం వల్ల బర్డ్ ఫ్లూ సోకే అవకాశమే లేదని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పాథాలజీ ప్రొఫెసర్ ఎ.ఆనంద్ కుమార్ స్పష్టం చేశారు.

=======================

పర్యాటక శాఖ ఈ సంవత్సరం 20 శాతం వృద్ధి రేటు సాధించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పర్యాటక శాఖపై ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుని పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని తెలిపారు. టూరిజం ఈవెంట్స్, కల్చరల్ ఈవెంట్స్, హోటల్ గదుల నిర్మాణం, పెట్టుబడులు, ల్యాండ్ లీజ్ పాలసీ వంటి వాటిపై సమీక్షలో చర్చించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే రాష్ట్రానికి 1,217 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నామని, 45 కోట్ల రూపాయలతో 11 టూరిజం రిసార్టులు, హోటళ్లు పునరుద్ధరించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

=======================

బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. ఈరోజు ఆయన సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ… బర్డ్‌ఫ్లూపై కొన్ని పత్రికలు, సామాజిక మాద్యమాలు ప్రజల్లో భయాన్ని సృష్టిస్తున్నాయని, ప్రజలను భయాందోళనలకు గురిచేస్తే కఠిన

చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉంగుటూరులో ఒకరికి బర్డ్‌ఫ్లూ సోకిందని ఓ పత్రికలో రాశారని.. ఇలాంటి తప్పుడు వార్తల కారణంగా ప్రజలు భయాందోళనకు గురవుతారని పేర్కొన్నారు. బర్డ్‌ఫ్లూపై పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, దీనిపై శాస్త్రవేత్తలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, శాస్త్రవేత్తలు ఇచ్చిన మార్గదర్శకాలను పాటిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ..

(వాయిస్ 41 సెకన్లు)

======================

రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి నారా లోకేశ్ తో ఈరోజు తైవాన్ కు చెందిన ఒక కంపెనీ ప్రతినిధుల బృందం సమావేశమయ్యింది. వస్త్ర రంగంలో ఆంధ్రప్రదేశ్ కి అపారమైన అవాకాశాలున్నాయని తమ కంపెనీ కార్యకలాపాలను విస్తరించేందుకు పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా వారిని మంత్రి కోరారు. రాష్ట్రంలో వస్త్రాలు, పాదరక్షల తయారీ పార్కులను స్థాపించడానికి ఆసక్తి కనబరిచినందుకు తైవాన్ ప్రతినిధి బృందానికి సామాజిక మాధ్యమం వేదికగా నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

======================

రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రోడ్లు, భవనాల శాఖా మంత్రి బిసి జనార్దన్ రెడ్డి ఆదేశించారు. నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం తమ్మరాజుపల్లె  వద్ద జరుగుతున్న జాతీయ రహదారి పనులను మంత్రి ఈరోజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వాహనాదారులకు సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి బిసి జనార్దన్ రెడ్డి ఆదేశించారు.

======================

ఆకాశవాణి తిరుపతి కేంద్రం ఈ నెల 15వ తేదీన రైతుల సౌలభ్యం కోసం రేడియో రైతు దినోత్సవ సదస్సును నిర్వహిస్తుంది. శనివారం ఉదయం 10 గంటలకు చిత్తూరు జిల్లా పెనుమూరు పులి గుండేశ్వర ఎఫ్.పి.సి. మ్యాంగో భవన్ లో జరగనున్న ఈ సదస్సులో చిత్తూరు జిల్లా స్థాయి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అలాగే శాస్త్రవేత్తలు పాల్గొని రైతు సోదరులకు ఆధునిక వ్యవసాయ మెళకువలను, యాజమాన్య పద్ధతులను వివరిస్తారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని మెరుగైన వ్యవసాయ విధానాలపై అవగాహనను పెంపొందించుకోవాలని ఆకాశవాణి తిరుపతి కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ మోహన్ ఈరోజు ఒక ప్రకటనలో కోరారు.

విరామం

======================

బర్డ్ ఫ్లూపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పాథాలజీ ప్రొఫెసర్ ఎ.ఆనంద్ కుమార్ తెలిపారు. తిరుపతిలోని పశువైద్య విశ్వవిద్యాలయంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఉమ్మడి గోదావరి జిల్లాలో మాత్రమే ఈ బర్డ్ ఫ్లూ ప్రభావం ఉందని.. రాయలసీమ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదన్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగితే ఈ వ్యాధి లక్షణాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ఎక్కువుగా నాటుకోళ్ళలో ఈ బర్డ్ ఫ్లూ వ్యాధి సోకుతుందని.. బాయిలర్ కోళ్ళలో ఈ వ్యాధి లక్షణాలు తక్కువగా ఉంటాయన్నారు. బాగా ఉడకబెట్టిన కోడి మాంసం, గుడ్లు తినడం వల్ల బర్డ్ ఫ్లూ సోకే అవకాశమే లేదని ప్రొఫెసర్ వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

======================

విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ప్రామాణిక విద్యతో పాటూ మెరుగైన ఆరోగ్య భద్రతను కల్పిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని కొమరాడ మండలం విక్రంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఈరోజు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలు, ఆంగ్ల భాషపై ఉన్న పరిజ్ఞానాన్ని సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థుల సమగ్ర విద్యా ఆరోగ్య నివేదిక అయిన "భవిత" కార్డులలో హిమోగ్లోబిన్ స్థాయిలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో కౌమార దశ బాలికలు, గర్భిణుల్లో 75 శాతం పైబడి రక్తహీనత ఉందని, దీనిని అధిగమించేందుకు విద్యార్థుల సమగ్ర ఆరోగ్య పరీక్ష వివరాలను భవిత కార్డులలో పొందుపరుస్తున్నామని తెలిపారు. హిమోగ్లోబిన్ 7 శాతం కంటే తక్కువ ఉన్న వారికి మంచి పౌష్టికాహారం అందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

======================

పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరు పౌల్ట్రీస్ లో వైరస్ సోకిన కోళ్ల పూడ్చివేత పక్రియ ఆర్.ఆర్.టి. బృందాల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికను కొనసాగుతున్నాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. ఈరోజు తణుకు మండలం వేల్పూరు గ్రామంలో బర్డ్ ఫ్లూ నియంత్రణకు కొనసాగుతున్న పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పశు వైద్యులతో కూడిన 22 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆర్ ఆర్ టి బృందాలకు యాంటీ వైరల్ డ్రగ్స్ ని కూడా అందజేయడం జరిగిందని తెలియజేశారు. సమీప పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖని ఆదేశించినట్లు తెలిపారు. వైరస్ కోళ్ల పూడ్చివేత ప్రక్రియ పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో కొనసాగుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యింది. మొత్తం 10 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఈరోజుతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు కూడా ముగిసింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు 22 వేల 493 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో పురుషులు 13 వేల 508, మహిళలు 8 వేల 985 మంది ఉన్నారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 5 వేల 529 మంది ఉండగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 568 మంది ఉన్నారు. కాగా ఈ నెల 27వ తేదీన జరగనున్న పోలింగ్ కోసం 123 కేంద్రాలను ఎంపిక చేశారు. వచ్చే నెల 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

======================
======================